
నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
5 | నల్లగొండ, శనివారం 7 జూన్ 2025 | YADADRI BHUVANAGIRI




రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్‌చైర్మన్ తదితరులు




హైదరాబాద్ మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్




వలిగొండలో ముందస్తు అరెస్టులు

# నిర్బంధకాండ

## ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు

### బీఆర్‌ఎస్ నాయకులు,కార్యకర్తలను కట్టడి చేసిన పోలీసులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా నిర్బంధకాండ కొనసాగింది. ఎక్కడికక్కడ ఆంక్షలు, అరెస్టులు, నిర్బంధాలు అమలై ముఖ్యమంత్రి పర్యటన ముగిసింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జిల్లా వ్యాప్తంగా ఎక్కడివారిని అక్కడే పెద్ద ఎత్తున ముందస్తు అరెస్టులు చేశారు. సీఎం పర్యటనను అడ్డుకుంటారనే కారణంతో బీఆర్‌ఎస్ నాయకులను కట్టడి చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. పార్టీ నాయకుల ఇండ్లలోకి వెళ్లి వాహనాల్లో ఎక్కించుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. బీఆర్‌ఎస్‌తో పాటు కమ్యూనిస్టులు, ప్రజా సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ట్రిపుల్ ఆర్ రైతులు, మాజీ సర్పంచ్‌లు, వివిధ సంఘాల నేతలను ముందస్తు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించి రోజంతా అక్కడే ఉంచారు. ఆలేరు నియోజకవర్గంతో పాటు ఇతర మండలాల్లోనూ అరెస్టుల పర్వం కొనసాగింది. సీపీఎం నేతలు, మాజీ సర్పంచ్‌లు, భువనగిరిలో మున్సిపల్ మాజీ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, బీఆర్‌ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఆత్మకూర్ (ఎం), ఆలేరు, తుర్కపల్లి, గుండాల, తదితర మండలాల్లో నేతలను అరెస్టు చేశారు.

- యాదాద్రి భువనగిరి, జూన్ 6 (నమస్తే తెలంగాణ)

## పసలేని సీఎం ప్రసంగం

యాదగిరిగుట్ట, జూన్ 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తి కావస్తున్నా బీఆర్‌ఎస్ పార్టీని గానీ, మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టకుండా ఉండలేదు. సరిగ్గా అదే తీరు తిరుమలాపూర్‌లో జరిగిన బహిరంగ సభ కనిపించింది. అస్తమానం కేసీఆర్‌ను నిందించడం తప్ప, ఆయన విజన్ మాత్రం ఎక్కడా కనిపించలేదు. దీంతో విసుగు చెందిన లబ్ధిదారులు వెనుదిరిగారు. ఒకవైపు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రారంభించి రెండు నిమిషాల్లోనే సుమారుగా 8 వేల మంది పైచిలుకు లబ్ధిదారులు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో లబ్ధిదారులకు కేటాయించిన ప్రత్యేక లాబీ పూర్తిగా ఖాళీకుర్చీలతో కనబడింది. దీంతో సభా ప్రాంగణమంతా బోసి పోయినట్లు కనిపించింది. ఇప్పటి వరకు ఎన్నో సభలు చూశామని, ఇంత నిర్బంధంగా సభలకు తీసుకువచ్చిన దాఖలాలు లేవన్నారు.



సీఎం సభలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

## బీర్ల బీరాలు

యాదగిరిగుట్ట, జూన్ 6: తుర్కపల్లి మండలంలోని తిరుమలాపూర్‌లో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు స్థానిక మంత్రులు సహాయంతో సీఎం రేవంత్‌రెడ్డి రూ. 1,500 కోట్లు మంజూరు చేసినట్లు ప్రగల్భాలు పలికారు. ఆలేరులో ఇక అభివృద్ధి పరుగులు పెడుతుందని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. కానీ వాస్తవానికి ఆయన తీసుకువచ్చింది కేవలం రూ. 868.45 కోట్లు మాత్రమే. వాస్తవానికి రూ. 1,051.45 కోట్లు మంజూరు కాగా ఇందులో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి పేరిట వైద్య కళాశాలను మంజూరు చేశారు. ఇందుకు గానూ రూ. 183 కోట్లు మం జూరు చేస్తూ 2022 జూలై 6 వ తేదీన అప్పటి ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీవో నంబర్ 85ను విడుదల చేసింది. 100 సీట్ల కెపాసిటీతో కళాశాలను ఏర్పాటు చేసి 2023 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించాలని జీవోలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య కళాశాలను తామే మంజూరు చేశామంటూ ప్రచారంచేసింది. రూ. 1,051.45 కోట్ల నుంచి రూ. 183 కోట్లు తీసివేస్తే మిగిలేది రూ. 868.45 కోట్లు. దీంతో పాటు గత ప్రభుత్వ హయాంలో కొలనుపాకలో హైలెవల్ బ్రిడ్జిగత ప్రభుత్వమే మంజూరు చేయగా మాజీ విప్ గొంగిడి శంకుస్థాపన కూడా చేశారు.



అరెస్ట్ చేసిన నాయకులను విడిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి

## అరెస్టులను సహించం

తుర్కపల్లి, జూన్ 6 : ప్రజాపాలన ముసుగులో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో నిర్బంధ పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. తిరుమలాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తుండడంతో బస్వాపురం రిజర్వాయర్ ముంపు గ్రామాలు చోక్లాతండా, పీర్యాతండా ముంపు బాధితులతో పాటు మాజీ సర్పంచ్‌లు బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ఇండ్లల్లోకి చొరబడి ముందస్తు అరెస్ట్ చేసి తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సునీత స్వయంగా తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలివెళ్లి ఏసీపీ శ్రీనివాసనాయుడుతో ఫోన్‌లో మాట్లాడి స్టేషన్‌కు తరలించిన నాయకులను విడుదల చేయించారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఎవ్వరూ అడ్డుకోవాల్సిన అవసరం లేదని ఆయన సాగిస్తున్న దుష్టపాలన చూసి ప్రజలే పట్టించుకోవడం మానేశారన్నారు. ఇక మీదట నాయకులు, కార్యకర్తలను అక్రమ అరెస్టులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే సునీత ప్రత్యేక చొరవ తీసుకుని విడుదల చేయించడంతో ముంపు బాధితులు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్ మండల సెక్రటరీ జనరల్ శ్యాగర్ల పరమేశ్, మాజీ ఎంపీటీసీ పలుగుల నవీన్‌కుమార్, సోషల్‌మీడియా నియోజకవర్గ కన్వీనర్ నల్ల శ్రీకాంత్, మండల కన్వీనర్ అయిలి, మాజీ సర్పంచ్‌లు మల్లప్ప, సురేశ్, బాలకృష్ణ, రాంజీ, భాస్కర్‌నాయక్, శ్రీనునాయక్‌తో పాటు ముంపు బాధితులు, బీజేపీ నాయకులు ఉన్నారు.

## అన్నీ ఉత్తమాటలే..

- జిల్లా ప్రజల విన్నపాలు వినలే..
- సీఎం పర్యటనలో మొండిచెయ్యి
- వరాలు ఇవ్వని ముఖ్యమంత్రి
- శంకుస్థాపనలు, ఉపన్యాసాలే..
- ప్రశంసలు, పొగడ్తలకే ప్రాధాన్యం
- విప్ బీర్ల విజ్ఞప్తిని పట్టించుకోలే
- సీఎం పర్యటనపై పెదవి విరుపు




యాదాద్రి భువనగిరి, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఉత్త మాటలు చెప్పి ఉబ్బించారు. జిల్లాకు ఏమీ ఇవ్వకుండా, ప్రకటించకుండా గుండు సున్నా పెట్టారు. యాదాద్రి ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల సంగతే ఎత్తలేదు. ట్రిపుల్ ఆర్ బాధితుల ముచ్చటే తీయలేదు. విప్ బీర్ల ఐలయ్య విన్నపాలు కూడా పరిగణనలోకి తీసుకోలేదు. ఏమీ ఇవ్వకుండా ఉత్త చేతులతో వెళ్లిపోయారు. గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించారు. అధికారంలోకి వస్తే, గెలిస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం..అని రేవంత్ రెడ్డితోపాటు అభ్యర్థులు సైతం వాగ్దానాలు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా హామీలు అమలుకు నోచుకోలేదు. గతేడాది నవంబర్‌లో పర్యటించినా ఎలాంటి అభివృద్ధి ప్రస్తావన తీసుకురాలేదు. శుక్రవారం జిల్లాలో ముఖ్యమంత్రి రావడంతో మనకు ఏమైనా ప్రకటిస్తారేమోనని ప్రజలు ఆశగా ఎదురు చూశారు. కానీ ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి. జిల్లాకు ఏమీ ఇవ్వకుండా ఖాళీ చేతులతో వెళ్లిపోయారు. ఎన్నో సమస్యలు ఉన్నా పట్టించుకోలేదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చారు. మోత్కూరు రెవెన్యూ డివిజన్, బస్వాపూర్ రిజర్వాయర్‌కు నిధులు, ఐటీ పార్క్, ఇండస్ట్రియల్ కారిడార్, భువనగిరిలో డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీ, పాలిటెక్నిక్ కళాశాల, మోడల్ మార్కెట్, భువనగిరి–చిట్యాల రోడ్డు విస్తరణ తదితర ఎన్నో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. రాచకొండ, కొలనుపాక భూదాన్‌పోచంపల్లి, భువనగిరి ఖిల్లా, యాదగిరిగుట్టను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాల్సి ఉన్నది. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారుస్తామని హామీ ఇచ్చినా దాని ప్రస్తావనే లేదు.

### విప్ బీర్ల విజ్ఞప్తి చేసినా..

పబ్లిక్ మీటింగ్‌లో బీర్ల ఐలయ్య సుదీర్ఘ ప్రసంగం చేశారు. అందులో తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, మరి కొన్ని సమస్యలను వినిపించారు. ఆలేరు రెవెన్యూ డివిజన్, ఆలేరులో బ్రిడ్జి, రాజాపేట బ్రాంచ్ కెనాల్, నవాబ్‌పేటనుంచి గుండాల మండలానికి నీరు, బొమ్మలరామారంలో రోడ్లు, డ్రైనేజీ తదితర అంశాలను ప్రస్తావించారు. మదర్ డెయిరీ కష్టాల్లో ఉందని, నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని సభాముఖంగా చేతులెత్తి వేడుకున్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం కనీసం వాటి గురించి ఒక్క మాట మాట్లాడలేదు. కొత్తగా ఒక్క ప్రాజెక్ట్ కూడా విదల్చలేదు. దీంతో అక్కడికి వచ్చిన జనం నిరాశగా వెనుదిరిగారు.

### శంకుస్థాపనలు, ఉపన్యాసాలకే పరిమితం..

సమస్యల నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికి రేవంత్ రెడ్డి చాకచక్యంగా వ్యవహరించారు. అభివృద్ధి నిధులు, సమస్యల జోలికి వెళ్లకుండా జిల్లా చరిత్రను చెబుతూ పోయారు. జిల్లాలో గతంలోని సాయుధ పోరాట వీరులు, ఉద్యమకారులు, పాత తరం రాజకీయ నాయకులు తదితర అంశాలను గుక్కతిప్పకుండా చెబుతూ జనాన్ని తన వైపు మళ్లించే ప్రయత్నం చేశారు. అంతే కాకుండా వేదికపై నేతలు ఒకరినొకరు పొగుడుకోవడానికే సరిపోయింది. మంత్రులు సీఎంను, ముఖ్యమంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డిలపై ప్రశంసలతోనే నిండిపోయింది. అంతకు ముందు పలు అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలకే పరిమితమయ్యారు.

## ఆర్టీసీ బస్సులు లేక అవస్థలు

తుర్కపల్లి మండలం తిరుమలాపురంలో నిర్వహించిన ప్రజా పాలన సభకు యాదగిరిగుట్ట డిపో ఆర్టీసీ బస్సులు కేటాయించడంతో గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం నిలిచిపోయింది. దాంతో ప్రయాణికులు వివిధ గ్రామాలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. ఆటోలు సైతం లేకపోవడంతో కాలినడకే దిక్కయింది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. రాజాపేట మండలానికి నిత్యం యాదగిరిగుట్ట డిపో నుంచి బస్సుల సౌకర్యం ఉండేది. ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూసినా ఒక్క బస్సుకూడా రాక పోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇక్కడి నుంచి నిత్యం యాదగిరిగుట్ట, భువనగిరి, హైదరాబాదుకు వ్యాపారులు, ప్రయాణికులు వెళ్తుండేవారు. సీఎం సభకు బస్సులన్నీ కేటాయించడంతో నిత్యం ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణికులు, వ్యాపారులు బస్సు సౌకర్యం లేక మండిపడుతున్నారు. పూర్తిగా బస్సులన్నీ సభలకు కేటాయించి ప్రయాణికులను ఇబ్బందులు పెట్టొద్దని మండల ప్రజలు కోరుతున్నారు. -రాజాపేట, జూన్ 6 :



బస్సులు లేక నడిచి వెళుతున్న ప్రజలు



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



రైతు సదస్సు వద్ద ధర్నా చేస్తున్న కొప్పోలు గ్రామస్తులు

### భూ భారతి సదస్సు..

## అడ్డుకున్న రైతులు

గుర్రంపోడ్, జూన్ 6 : మండలంలోని కొప్పోల్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూ భారతి సదస్సును గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలోని ఆలయ భూములకు సర్వే చేపట్టి హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవట్లేదని వారు ఆరోపించారు. మార్చి 21న జరగాల్సిన ఆలయ భూముల సర్వేను అర్ధాంతరంగా ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. అధికారులు ఒత్తిడితో ఆపేశారా? లేక కబ్జాదారులకు సహకరిస్తున్నారా? అంటూ నిలదీశారు. స్పందించిన దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి వారంలోగా ఆలయ భూముల సర్వే ప్రారంభిస్తామని ఫోన్ ద్వారా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఐతగోని పరమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ తిరుగుడు లింగారెడ్డి, ఐతగోని కృష్ణాగౌడ్, పోల లక్ష్మీనారాయణ, కొత్త నాగరాజు, తేలుకుంట్ల రవి, పందుల రమేశ్, కొత్ర రమేశ్, మామిడి నరేశ్, ఎడ్ల నరేశ్, పోలేపల్లి నగేశ్, బొమ్ము నాగరాజు, ఆవుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.